క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు



మంత్రికి ప్రసాదాలు అందజేస్తున్న డీసీ సాగర్‌బాబు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మి దేవి, ఆంజనేయస్వామిని ఆదివారం పాండిచ్చేరి మంత్రి ఓం నమఃశివాయం, ఐఏఎస్ అధికారి ముత్యాలరాజు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ డీసీ సాగర్ బాబు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.



ముత్యాలరాజుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న డీసీ సాగర్‌బాబు

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక పఠనం చేయిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

వెంకటగిరి రూరల్ : పుస్తక పఠనం చేయడం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. జ్ఞానాన్వేషణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెంకటగిరి పట్టణం తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో బీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు.

వృద్ధులకు ఫల సరుకులు వితరణ



ఫల సరుకులు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు ఫల సరుకులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి సనత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలోని పేద వృద్ధులకు సంఘం ద్వారా ప్రతి నెలా ఫల సరుకులు ఇస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో గూడూరు పట్టణంలోని దివంగత డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆసరా ద్వారా వారి కుటుంబ సభ్యులు డాక్టర్ జనార్ధనరెడ్డి, రోహిణి దంపతులు ప్రతి నెలా ఫల సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటక్రిష్టారెడ్డి, కందాటి రాఘవరెడ్డి, ఎర్రమాక క్రిష్టారెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు సమర్పణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామ దళితవాడలో గ్రామదేవత పోలేరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బడి బయటే బాల్యం

విద్య రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అందులో భాగంగానే 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అందించాలి. మండలంలో అనేక మంది పిల్లలు బడిబయటే ఉంటున్నారు. పనులకు వెళుతున్నారు. గత ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తూ నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద పథకాలు అమలుచేసి పిల్లల హాజరును పెంచింది. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పిల్లలను గుర్తించి బడిలో చేర్పేందుకు విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. – కోట

- పనులకు వెళుతున్న పిల్లలు
- మొక్కుబడిగా నేను బడికి పోతా సర్వే
- పట్టించుకోని అధికారులు



బడి అంటే ఏమిటో తెలియదంటున్న తిన్నెలపూడి లంక గిరిజన కాలనీ చిన్నారులు

కోట మండలం తిన్నెలపూడి పంచాయతీలో లంక గిరిజన కాలనీలో 5 నుంచి 14 ఏళ్ల వయస్సున్న పిల్లలు 20 మంది వరకు ఉన్నారు. వారు బడి అంటే ఏమిటో మాకు తెలియదని అంటున్నారు. తల్లిదండ్రులతో పాటు పనులకు, చేపల వేటకు వెళుతున్నారు. గతంలో ఇక్కడ అధికారులు ప్రత్యామ్నాయ పాఠశాలను ఏర్పాటు చేసి చదువుకునేందుకు అవకాశం కల్పించారు. కరోనా అనంతరం ప్రత్యామ్నాయ పాఠశాల రద్దు అయింది. బడిబయటి పిల్లలను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో చేర్చారు. ఈ ఏడాది డ్రాపవుట్స్ కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టలేదు. ముఖ్యంగా 8 నుంచి 14 ఏళ్ల వయస్సున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన చిన్నారులు భూస్వాముల వద్ద పశువుల కాపరులుగా, ఇటుక బట్టీలు, కర్మాగారాల్లో బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. మండలంలోని కోట, విద్యానగర్, సిద్ధవరం, కొత్తపట్నం, చిట్టేడు గ్రామాల్లో చిన్నారులు అధికంగా దుకాణాలు, హోటళ్లలో పనిచేస్తున్నారు. విద్యానగర్ ప్రకాశం కాలనీ, ఎన్టీఆర్ గిరిజన కాలనీలో చిన్నారులు చిత్తు కాగితాలు ఏరుకుంటూ వీధుల్లో కనిపిస్తున్నారు. ఇక్కడ పాత సామగ్రి కొనుగోలు చేసే వ్యాపారులు ముందుగానే డబ్బులు ఇచ్చి తల్లిదండ్రులతో ఒప్పందం చేసుకుని చిన్నారులతో పాత సామగ్రి ఏరిస్తున్నట్లు సమాచారం.

పట్టించుకోని ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల కళ్లదుటే ఈ తంతు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తీరప్రాంతంలో ఆక్వా సాగు పెరగడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. తల్లిదండ్రులు కూలీలుగా రొయ్యల గుంతల వద్ద పనిచేస్తుండగా పిల్లలను బడి మాన్పించి పనులకు పంపుతున్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో గిరిజన కాలనీలకు సంబంధించి విద్యార్థుల హాజరు శాతం చాలా తక్కువగా ఉంటోంది. వీరంతా బడిలోనే ఉన్నట్లు చెబుతున్నా అది వాస్తవం కాదని తెలుస్తోంది. కొందరు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పనులకు వెళుతున్న పిల్లలను పాఠశాలకు తీసుకువస్తున్నా వారి కొనసాగింపు కష్టంగా ఉంది. విద్యానగర్‌లోని ఎన్టీఆర్ కాలనీలో పాత సామగ్రి ఏరుతున్న విద్యార్థులను పలకరించగా బడికి వెళ్లాలని ఉన్నా తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాల్సి వస్తోందని తెలిపారు.

సీఆర్‌పీలకు అదనపు బాధ్యతలు



మండలంలోని డ్రాపవుట్స్‌ను గుర్తించేందుకు సీఆర్‌పీలకు అదనపు బాధ్యతలు అప్పగించాం. వారు పిల్లలను గుర్తిస్తున్నారు. తల్లిదండ్రులతో పిల్లలను మాట్లాడి పాఠశాలల్లో చేర్పిస్తాం. అదేవిధంగా మండలంలో ప్రత్యామ్నాయ పాఠశాలల ఏర్పాటు దిశగా ఉన్నతాధికారులు ఇటీవల సర్వే చేయించారు. మూడు, నాలుగు చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నాం.

– మస్తానయ్య, ఎంఈవో–2





విద్యానగర్ వీధుల్లో పాత సామగ్రి సేకరిస్తున్న పిల్లలు

క్రికెట్ పోటీల జెర్సీలు ఆవిష్కరణ

గూడూరు రూరల్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించే క్రికెట్ పోటీల్లో ప్రతి ఉపాధ్యాయుడూ పాల్గొనాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదివారం ప్రగతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలకు సంబంధించిన 19 రకాల జెర్సీలను ఆయన ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ 2019లో ప్రారంభించిన టీసీఎల్ టోర్నమెంటును యధావిధిగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ కరీముల్లా, మురళీ సింగ్, బాబర్, పీఈటీ భాస్కర్, మణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

చెన్నైకి చెందిన కేవీటీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ఆదివారం గూడూరు పట్టణంలోని సీఎస్ఎం స్కూల్ ఆవరణలో బుజ్జమ్మ సేవా ట్రస్టు సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా గూడూరు ఏరియా ఆస్పత్రి వైద్యులు రక్తదాన శిబిరం చేపట్టారు. పలువురు పాల్గొని రక్తదానం చేశారు. కేవీ ఆస్పత్రి నిర్వాహకులు వివేకానంద్, ఆస్పత్రి చైర్మన్ సెంథిమిన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



కోడిగుడ్లు, కూరగాయలు అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాలకు చెందిన పలువురు దివ్యాంగులకు ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉద్యోగుల విశ్రాంతి భవన్‌లో కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఆస్పత్రిలో ప్రతి నెలా పరీక్షలకు వచ్చే గర్భిణులకు భోజన వసతితో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే గత ఏడాది నుంచి ప్రతినెలా మూడో ఆదివారం దివ్యాంగులకు కోడి గుడ్లు, కూరగాయలు అందించేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆర్ఆర్ ప్రావిజన్స్ అధినేత ప్రభాకరరెడ్డి దాతృత్వంతో కూరగాయలు, కోడిగుడ్లు అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నాగరాజు, చెంచు నారాయణ, రాధయ్య, శ్రీనివాసాచారి, సుబ్రమణ్యం, ప్రసాద్, రజనీ, ఇబ్రహీం, రెడ్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

20 నుంచి ఆధార్ క్యాంపులు

సైదాపురం: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని కొమ్మిపాడు, కలిచేడు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు పనిచేస్తాయని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పెంచలకోనలో లక్ష తులసీ దళార్చన

రాపూరు : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం లక్ష తులసీ దళార్చన, లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తులసీ దళార్చన, ఆదిలక్ష్మీ అమ్మ వారికి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. దాని స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నట్టు దళిత బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు కె.సహదేవయ్య తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్ ఆశయ సాధకులు, ప్రజాస్వామ్యవాదులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



సాయికృష్ణ యాచేంద్రతో చర్చిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం తెగచర్ల గ్రామ ఎంపీటీసీ ఈగా బుజ్జిరెడ్డి అన్న వీరపరెడ్డి కుమార్తె అంజలి వివాహం జరిగింది. ఇందులో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, నాయకులు రమణారెడ్డి, నరసింహారెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నానరు.

వెంకటగిరి రాజాను కలిసిన నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి రాజా కుటుంబ సభ్యులు డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్రను వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వెంకటగిరి రాజకీయాలపై కొంతసేపు ఏకాంతంగా చర్చించుకున్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు : మండలంలోని తీర ప్రాంతం తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందున్న త్రిశూలం వద్ద మహిళలు పెద్ద ఎత్తున కొబ్బరికాయలు కొట్టారు. పొంగళ్లు పెట్టారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఈవో నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

నేడు చండీ హోమం

శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ముత్యాలమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్ పర్సన్ ఇంద్రసేనమ్మ తెలిపారు. ప్రతి పౌర్ణమికీ చండీ హోమం చేపట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే హోమంలో పాల్గొన దలచిన భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం



మధ్యలోనే నిర్మాణం ఆగిన అంగన్‌వాడీ భవనం

చిల్లకూరు : మండలంలోని బూదనం గ్రామం అరుంధతివాడలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అరుంధతివాడలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలు సమీపంలోని బూదనంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు అరుంధతివాడలో భవనం నిర్మించాలని 2018లో నిర్ణయం తీసుకున్నారు. రూ.7 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి పనులు మొదలు పెట్టి కొంత వరకు పూర్తి చేశారు. తర్వాత బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులను నిలిపివేశారు. ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణం అసంతపూర్తిగా ఉండిపోయింది. పిల్లలు బూదనం వెళ్లి వచ్చేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తి చేసి స్థానికంగానే పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాలని కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జనరల్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు సౌజన్యంతో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల వైద్యులు రోగులను పరీక్షించారు. 150 మందికి పైగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు, 50 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు ట్రస్టు డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామానాయుడు తెలిపారు. 45 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ట్రస్టు ఏవో గల్లా కృష్ణ, అరవింద్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన సుబ్రమణ్యం

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆదివారం బైక్‌ను కారు ఢీకొన డంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దొరవారిసత్రం మండలం ఏకొల్లుకు చెందిన మదనంబేటి సుబ్రమణ్యం, మునుస్వామి నాయుడుపేటకు చెందిన మునుస్వామితో కలిసి కనుపూరుకు బైక్‌లో వెళ్లారు. తిరిగి నాయుడుపేటకు వస్తుండగా వైఎస్సార్ సర్కిల్ మలుపు వద్ద వేగంగా వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా సాగుతున్న క్రికెట్ పోటీలు

వెంకటగిరి రూరల్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని తారక రామా క్రీడా ప్రాంగణంలో సౌత్ సీనియర్ విభాగంలో క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం అనంతపురం–కర్నూలు జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టు టాస్ గెలిసి బ్యాటింగ్ ఎంచుకుంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కర్నూల్ జట్టు 43.1 ఓవర్లకు 165 పరుగులు చేసి ఆలౌటయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 57 ఓవర్లకు 276 పరుగులు చేసింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 49 ఓవర్లకు 170 పరుగులు చేసి 8 వికెట్లు కోల్పోయింది. 59 పరుగులు తేడాతో కర్నూలు జట్టు ఆధిక్యంలో ఉంది.

నవోదయకు సీఎన్ పేట విద్యార్థి ఎంపిక



లీలాఅర్జున్

పెళ్లకూరు: మండలంలోని చెన్నప్పనాయుడుపేట గ్రామానికి చెందిన పుట్టా లీలాఅర్జున్ నవోదయ విద్యాలయకు ఎంపికయ్యాడు. పుట్టా భానుప్రకాష్, చైతన్య దంపతుల కుమారుడు లీలాఅర్జున్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి 6వ తరగతిలో ప్రవేశం పొందాడు. విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.